# కేజీబీవీలకు క్రేజ్..

## మెరుగైన విద్య, వసతులతో పెరిగిన డిమాండ్



పెద్దఅడిశర్లపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

రామగిరి, జూలై 19: విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ సౌకర్యాలు కల్పిస్తుండడంతో దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డులు వెలుస్తున్నాయి. ముఖ్యంగా తల్లిదండ్రులు లేని పిల్లలు, తల్లిదండ్రుల్లో ఒకరు ఉండి మరొకరు లేనివారు, వలస వెళ్లిన పిల్లలు, పేద విద్యార్థినుల కోసం ప్రభుత్వం కేజీబీవీలను స్థాపించింది. పదేండ్ల క్రితం కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువ. రాష్ట్రం ఏర్పాటు తర్వాత కేజీబీవీల్లో విద్యా ప్రమాణాలను మెరుపరుస్తూ కొత్త భవనాలు, మౌలిక వసతులు కల్పించడంతోపాటు మెరుగైన విద్యాబోధన, రుచికరమైన పౌష్టికాహారం, డిజిటల్ తరగతుల అమలుతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

### ఈ ఏడాది పెరిగిన విద్యార్థినుల సంఖ్య ఇలా..

కేజీబీవీల్లో ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు భారీగా పెరిగాయి. వాస్తవానికి ఒక్కోక్క తరగతిలో ప్రభుత్వం 40 సీట్లు మాత్రమే కేటాయించింది. కానీ జిల్లా వ్యాప్తంగా ఉన్న 27 కేజీబీవీల్లో ప్రతి తరగతిలో 50 మంది విద్యార్థులకు మించి అడ్మిషన్లు అయ్యాయి. ఈ విద్యా సంవత్సరం 6వ తరగతిలోనే 1,406 మంది విద్యార్థినులు చేరారు. అయితే 6 నుంచి 12వ తరగతి వరకు ఆయా పాఠశాలల్లో 7,859 మంది విద్యార్థినులు ఉన్నారు. వీటిలో ఈ పర్యాయం అడ్మిషన్లకు అధికారులు, ప్రజాప్రతినిధుల సిఫార్సు సైతం కొనసాగింది. విద్యార్థినుల సంఖ్య రోజురోజుకు పెరిగి పోతుండడంతో ప్రజాప్రతిధులు, అధికారులు సీట్లు కావాలని రిక్వెస్ట్ చేసే పరిస్థితులు నెలకొన్నాయి.

### నల్లగొండ జిల్లాలో 27 కేజీబీవీలు..

రాష్ట్రం ఏర్పాటు కంటే ముందు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 14 కేజీబీవీలుండేవి. అయితే స్వరాష్ట్రంలో ప్రభుత్వం బాలికా విద్యకు ప్రాధాన్యమివ్వడంతో ప్రస్తుతం వాటి సంఖ్య 56కు చేరింది. కేవలం నల్లగొండ జిల్లాలోనే 27 కేజీబీవీలు ఉండగా వీటిలో 12 పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు నిర్వహిస్తున్నారు.

### ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్

జిల్లా వ్యాప్తంగా 27 కేజీబీవీలుండగా వీటిలో గతంలో పదోతరగతి వరకు మాత్రమే బోధన ఉండేది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వీటిని అప్‌గ్రేడ్ చేస్తూ వస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా 13 కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ వరకు బోధన సాగుతున్నది. అంతే కాకుండా విద్యార్థినులకు డిజిటల్ తరగతుల సైతం ప్రభుత్వం అందిస్తున్నది.

### జిల్లాలో అడ్మిషన్లు ఇలా..

కేజీబీవీ అడవిదేవులపల్లిలో 221 మంది విద్యార్థినులు, నాగార్జునసాగర్‌లో 375, చందంపేటలో 235, చండూర్ 325, చింతపల్లిలో 230, దామరచర్లలో 410, దేవరకొండలో 659, గుండ్లపల్లి(డిండి)లో 204, గుర్రంపోడులో 210, కనగల్‌లో 241, కట్టంగూర్‌లో 319, కేతేపల్లిలో 365, కొండమల్లేపల్లిలో 155, మాడ్గులపల్లిలో 334, మర్రిగూడలో 260, మిర్యాలగూడ(వేములపల్లి)లో 313, మునుగోడులో 390, నాంపల్లిలో 232, నేరేడుగొమ్ములో 214, నిడమనూర్‌లో 251, పీ.ఏ.పల్లిలో 269, పెద్దవూరలో 355, శాలిగౌరారంలో 214, తిప్పర్తిలో 348, తిరుమలగిరి(సాగర్)లో 215, త్రిపురారంలో 158, మిర్యాలగూడలో 357 మంది కలిపి మొత్తం 7,859( 6 నుంచి 10 తరగతి వరకు 6,432 మంది, ఇంటర్మీడియట్ లో 1,427 మంది విద్యార్థినులున్నారు.

### ఇంటర్మీడియట్ ఉన్న 13 కేజీబీవీలు ఇవే...

జిల్లా వ్యాప్తంగా 13 కేజీబీవీలు ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. నాగార్జునసాగర్, చండూర్, దామరచర్ల, దేవరకొండ, కట్టంగూర్, కేతేపల్లి, మాడ్గులపల్లి, మర్రిగూడ, నాంపల్లి, మునుగోడు, పెద్దవూర, తిప్పర్తి, మిర్యాలగూడ కస్తూరిబా విద్యాలయాలు ఉన్నాయి.

### ప్రభుత్వం కల్పిస్తున్న వసతులతో అడ్మిషన్లకు పోటీ



కేజీబీవీల్లో మెరుగైన బోధనతోపాటు రుచికరమైన పౌష్టికాహారం, శారీరక వ్యాయామంతోపాటు భరోసా కల్పించేలా ప్రభుత్వం ఉచితంగా విద్యనందిస్తుండడంతో అడ్మిషన్లకు పోటీ బాగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 27 కేజీబీవీల్లో 6,432 మంది విద్యార్థినులు చేరారు.

– బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

### సీట్ల కోసం పోటీ



పీ.ఏ.పల్లి మండలంలో చాలా వరకు ఆటో సౌకర్యం లేని గ్రామాలున్నాయి. దాంతో అందరి పిల్లలకు హాస్టల్ వసతి కావాల్సిన అవసరం ఉంది. మరో వైపు ప్రభుత్వం కేజీబీవీల్లో మెరుగైన విద్య, పౌష్టికాహారం అందిస్తుంది. గతేడాది పదోతరగతి ఫలితాల్లో ఇతర పాఠశాలలతో చూస్తే ఉత్తమ ఫలితాలతో మా విద్యార్థినులు సత్తా చాటారు. దాంతో ప్రవేశాల కోసం పోటీ నెలకొన్నది. వాస్తవానికి ప్రతి తరగతిలో 40సీట్ల చొప్పున 200 సీట్లు మాత్రమే పాఠశాలలో అవకాశం ఉంది. అయితే మా పాఠశాలలో అంతకు మించి ఈ విద్యా సంవత్సరం 283 మంది విద్యార్థినులను చేర్చుకున్నాం.

–కత్తుల సరళ, ఎస్ఓ, కేజీబీవీ, పీ.ఏ.పల్లి

# అల్లరి

ALLARI

### చెప్పుకోండి



1. భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ ఎక్కడ ఉన్నది?
2. ఫలక్‌నుమా ప్యాలెస్‌ను నిర్మించింది ఎవరు?
3. స్టెతస్కోప్‌ను కనుగొన్నది ఎవరు?

### పదసృష్టి




కింద ఇచ్చిన పదం లోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Father

Ex : Teeth

### నిజాయతీ

కథ



ఊరి బయట వేపచెట్టు కింద కూర్చుని బిచ్చమెత్తి తెచ్చుకున్న అన్నం తింటున్నాడు రంగయ్య. ఏదో ఆలోచిస్తూ తింటున్న అతని నోటికి ఏదో గట్టిగా తగిలింది. తీసి చూస్తే బంగారు ఉంగరం! 'ఇది నా జోలెలోకి ఎలా వచ్చింది?' అని తెగ ఆలోచించాడు. 'ఎవరో తల్లి కబళం వేసేటప్పుడు ఆమె చేతి ఉంగరం జారి జోలెలో పడినట్టుంది. ఇది ఎవరిదైతే వారికి ఇచ్చేయాలి. ధర్మం చేసిన వారికి నేను అధర్మం చేయకూడదు!' అనుకున్నాడు. కానీ, ఎవరికి ఇవ్వాలి? ఒక ఇంట్లో భిక్షమైతే గుర్తుపట్టవచ్చు. ఇవాళ పది ఇళ్లలో అన్నం అడుక్కున్నాడు. వాళ్లలో ఏ ఇల్లాలిదై ఉంటుంది? పోనీ ఊరిపెద్ద చలమయ్యకు ఇస్తే.. అసలువాళ్లకు చేర్చమని. కానీ, అతను పెద్ద అవినీతిపరుడు. తనే జేబులో వేసుకుంటాడు. తర్వాత తను వెళ్లి అడిగితే.. 'నువ్వు నాకు ఉంగరం ఇవ్వడం ఏంట్రా?' అని తన్ని తరిమేస్తాడు. జనం కూడా బిచ్చగాడి మాటలు నమ్మరు కదా? మరి ఎలా? తొందరపడకూడదు. జాగ్రత్తగా ఆలోచించి అసలు యజమానురాలికి దీన్ని చేర్చాలి అని ఆలోచించాడు. మర్నాడు బిచ్చానికి వెళ్లినప్పుడు ఆ ఇల్లాళ్ల ముఖ కవళికలు పరిశీలించడం మొదలుపెట్టాడు. వారి కుడి చేతివేళ్లను కూడా గమనించాడు. తొమ్మిది ఇళ్లలోని వారు ఎప్పటిలాగే చిర్రుబుర్రులాడుతూ ఎలాంటి విచారం లేకుండా భిక్షం వేశారు. కానీ, పదో ఇంటి ఇల్లాలు లక్ష్మీ రమణమ్మను భిక్షం వేస్తున్నప్పుడు పరిశీలనగా చూశాడు. ఆమె దిగులుగా ఉన్నట్టు అర్థమైంది. ఆవిడ కుడిచేతిని చూస్తే ఉంగరం లేదు కానీ, అది ఉండేదన్నట్టు వేలికి అచ్చు ఉంది. దాంతో తన జోలెలో పడిన ఉంగరం ఆమెదే అని తీర్మానించుకున్నాడు. లక్ష్మీరమణమ్మ భిక్షం వేసి లోపలికి పోబోతుండగా.. ''అమ్మగారూ!'' అని పిలిచాడు. ఆవిడ ఏంటన్నట్టు వెనుతిరిగి చూసింది. అప్పుడు తన చింకిపాతలో దాచిన ఉంగరాన్ని బయటికి తీసి, అరచేతిలో పెట్టుకుని ఆమెకు చూపి.. ''ఇది మీదే కదా అమ్మగారు?'' అని అడిగాడు. ఆవిడ కళ్లు ఆనందంగా మెరిశాయి. ''అవును బాబూ నాదే! నీకు ఎక్కడ దొరికింది?'' అన్నది ఆశ్చర్యంగా. ''నిన్న మీరు భిక్షం వేసేటప్పుడు నా జోలిలో పడిందమ్మా.. ఎవరిదా? అని ఆలోచించి ఆలోచించి బుర్ర వేడెక్కిపోయింది. అందుకనే ఇవాళ అన్నం వేసే అమ్మలందరినీ పరిశీలనగా చూశాను. వాళ్ల చేతివేళ్లు కూడా పరిశీలించాను. మీ ముఖంలో ఎప్పటిలా సంతోషం లేదు. పైగా దిగులు! మీ వేలికి ఉంగరం హద్దు ఉంది గానీ, ఉంగరం లేదు. అందుకే మీదేనని పోల్చుకున్నాను'' అన్నాడు ఉంగరం ఆమె చేతిలో పెడుతూ. ''అవును బాబు ఇది నాదే! ఇది పోయిందని రాత్రంతా నిద్ర లేదు. తిండి లేదు. నీ గొప్ప గుణానికి రెండు చేతులెత్తి మొక్కుతున్నాను. పేదవాడివైనా ఖరీదైన ఉంగరాన్ని తిరిగి తెచ్చిచ్చావు. నువ్వు నిజంగా గొప్పవాడివి బాబు'' అంటూ ఆనందబాష్పాలు రాల్చిందామె. ''మీలాంటి ధర్మ తల్లులకు దేవుడు ఎప్పుడూ అన్యాయం చేయడమ్మా!'' అని వెనుతిరిగి వెళ్లిపోయాడు రంగయ్య. వెళ్లిపోతున్న రంగయ్య ఆమెకు బిచ్చగాడిలా కాక.. సాక్షాత్తూ దేవుడిలా కనిపించాడు. మరోసారి అతనికి మొక్కి ఇంట్లోకి వెళ్లిపోయింది లక్ష్మీ రమణమ్మ.

**నీతి :** పేదవాడైనా.. ధనవంతుడైనా నిజాయతీ అవసరం.

• చంద్రప్రతాప్ కంతేటి

### పెద్దల మాట




కాంతి ఏ దీపం నుంచి వచ్చినా మంచిదే! గులాబీ ఏ తోటలో విరిసినా అందంగానే ఉంటుంది.

• సర్వేపల్లి రాధాకృష్ణన్

### ఐదు నదుల నేల

పంజాబ్ పేరుతో మనదేశంలోనే కాదు పాకిస్తాన్‌లోనూ ఓ రాష్ట్రం ఉంది. మనది తూర్పు పంజాబ్, పాకిస్తాన్‌లోది పశ్చిమ పంజాబ్. ఈ పదం రెండు వేర్వేరు పదాల కలయికగా ఏర్పడింది. పర్షియా (ఇప్పటి ఇరాన్) భాషలో 'పంజ్' అంటే ఐదు, 'అబ్' అంటే నీళ్లు అని అర్థం. ఐదు నదుల




నీళ్లు ప్రవహించే నేల అనే అర్థంలో పంజాబ్‌కు ఆ పేరు వచ్చింది. పూర్వం గ్రీకులు ఈ ప్రాంతాన్ని పెంటాపొటేమియా (పెంటా– ఐదు, పొటేమియా– నదుల ప్రాంతం) అని పిలిచారు. ఆ ఐదు నదులు ఏవంటే..? జీలం, చినాబ్, రావి, సట్లెజ్, బియాస్. ఇవన్నీ పాకిస్తాన్‌లో మరో పెద్ద నది అయిన సింధు నదిలో కలుస్తాయి. ఈ నదులు తీసుకువచ్చిన ఒండ్రుమట్టి వల్ల పంజాబ్ ప్రాంతం ఎంతో సారవంతంగా ఉంటుంది. పంటలు బాగా పండుతాయి.

### ఆ పదమేంటి?


ఇచ్చిన అక్షరాలను ఒకటి
సరైన పదాన్ని కనుక్కోండి.



S _ _ _ _ _ _

O N A M W N

### చిట్టి స్కెచ్





జి. చిన్మయి,

### జవాబులు

చెప్పుకోండి: 1. న్యూఢిల్లీ, 2. నవాబ్ వికార్ ఉల్ ఉమ్రా, 3. రెనీ లెనెక్

ఆ పదమేంటి? : snow man

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com